ప్రమాదకరస్థితిలో భక్తుల ప్రయాణం

- ట్రక్కు ఆటోల్లో కిక్కిరిసి శ్రీవారి క్షేత్రానికి వస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి క్షేత్రానికి కొందరు భక్తులు ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ట్రక్కు ఆటోలు, బొలేరో ట్రక్కు వాహనాల్లో పరిమితికి మించి భక్తులు ఎక్కి దైవదర్శనార్థం క్షేత్రానికి వస్తున్నారు. మర్గం మధ్యలో పెనుప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటనేది వారు ఆలోచించడంలేదు. ఏదో ఒక విధంగా క్షేత్రానికి వచ్చి శ్రీవారిని దర్శించాలన్న ఆతృత, చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారుల వ్యవహార శైలి మాటున ప్రమాదాలు పొంచి ఉన్నాయి. క్షేత్రంలో వివాహాలు జరిగే సమయంలో ఇలాంటి ప్రయాణాలు ఎక్కువగా ఉంటున్నాయి. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ఇటువంటి ప్రయాణాలను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని స్థానికులు, భక్తులు అధికారులను కోరుతున్నారు.


శ్రీవారి కొండపైకి బొలేరో ట్రక్కు వాహనంలో వస్తున్న భక్తులు


ట్రక్కు ఆటోలో కొండపైకి వస్తున్న భక్తులు

క్లుప్తంగా

మద్ది హుండీల ఆదాయం రూ.54.71 లక్షలు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో హుండీ ఆదాయన్ని గురువారం లెక్కించినట్టు మద్ది ఈఓ ఆర్వీ చందన తెలిపారు. 85 రోజులకు హుండీల ద్వారా రూ.49,67,182, చిల్ల రూపేణా రూ.4,22,927, అన్నదానం హుండీ ద్వారా రూ.81,370 మొత్తం ఆదాయం రూ.54,71,479 వచ్చినట్టు చెప్పారు. ఏలూరు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీబీ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సైగా కుటుంబరావు


కుటుంబరావు, ట్రాఫిక్ ఎస్సై

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సైగా ఎం కుటుంబరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చింతలపూడి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా పని చేసి బదిలీపై వచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తానని ఆయన చెప్పారు.

విజయ దుర్గమ్మకు జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న అర్చకుడు

జంగారెడ్డిగూడెం: ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, రైతులు పాడిపంటలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి సప్త నది జలాలు, పంచామృతాలతో సన్నాయి మేల తాళాల నడుమ జలాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించారు. కార్యక్రమంలో మారిశెట్టి రాధాకృష్ణ, మాడ రామ్మోహనరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, మారిసెట్టి అంజన్ కుమార్, గుడిమెట్ల యుగంధర్, యర్రం ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

దత్తాత్రేయునికి పూజలు


దత్తాత్రేయునికి పూజ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన దత్తాత్రేయునికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు నిర్వహించి, సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు, రేపు క్రీస్తు మహాసభలు

కొయ్యలగూడెం: క్రీస్తు మహాసభలు 20, 21వ తేదీల్లో సీతంపేట జీడీఎం చర్చి గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు జీడీఎం చర్చి పాస్టర్ పీటర్ రాజు గురువారం తెలిపారు. పలువురు ఆధ్యాత్మిక వేత్తలు క్రీస్తు సందేశాన్ని వినిపిస్తారని, విశ్వాసులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

యోగా డేను విజయవంతం చేద్దాం


కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం: ఈనెల 21న స్థానిక బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించే యోగ డేను విజయవంతం చేయాలని వాకర్స్ క్లబ్ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం క్లబ్ సమావేశం నిర్వహించారు. ప్రపంచానికి యోగాని పరిచయం చేసిన ఘనత భారతదేశానికి దక్కుతుందని సభ్యులు పేర్కొన్నారు. ఊహ తెలిసిన చిన్నారి నుంచి వృద్ధాప్యానికి చేరిన అందరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

21, 22 తేదీల్లో సీపీఐ మహాసభలు

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు ఏరియా 6వ మహాసభలు ఈ నెల 21, 22 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లలో సదుపాయాలు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ నాయకులు కురెళ్ళ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన


అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అతిసారా వ్యాధిపై బయ్యన్నగూడెం దళితవాడలో గురువారం బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార వ్యాధి వల్ల మరణాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 16 నుంచి జూలై 31 వరకు అతిసార వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బిడ్డకు రోజులో మూడు లేదా అంత కంటే ఎక్కువ సార్లు నీళ్లగా విరోచనాలయితే అది అతిసార వ్యాధి అని, అతిసారంలో శరీరంలో ఉండే ఖనిజ లవణాలు బయటకు పోయి డీ హైడ్రాషన్‌కు లోనైనపుడు వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం తాగటం వల్ల మరణాలు సంభావించకుండా కాపాడుకోవచ్చని వివరించారు. చల్లార్చిన మంచి నీటినిగాని క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. బాషా, రవితేజ, నాగమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏలూరు(మెట్రో): ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సురేంద్రకు సూచించారు. జిల్లా సమాచార పౌర సంబంధాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా సమాచార పౌర సంబంధాధికారి యు.నరేంద్ర గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సురేంద్రకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సమాచార శాఖ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేయాలన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 45 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో గురువారం నిర్వహించిన డీఈఎల్ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షకు 45 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఒకరు గైర్హాజరయ్యారని, ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతి


ఐసీడీఎస్ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కుక్కునూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా నాయకులు కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కుక్కునూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందిని ప్రజాసాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదును తొలిగించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరారు. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మెనూ ధర పెంచి సరుకులను ప్రభుత్వమే నేరుగా అందజేయాలని, సన్నబియ్యం సరఫరా చేసి మెరుగైన వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జూలై 9 నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని దారయ్య పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ సమస్యలపై కుక్కునూరు ఐసీడీఎస్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, మహిళా సంఘం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు, వరసా పాపారావు, వరకా శ్యామల, కొలురి సైదా, చందా రమాదేవి, పిట్టా రమాదేవి, మడకం బద్రి, నుపా భద్రయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని వదిలి అంబేడ్కు రాజ్యాంగాన్ని అమలు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిటికెన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన తన నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, సూపర్ సిక్స్ హామీ పథకాలు అటకెక్కాయని ధ్వజమెత్తారు. పథకాలపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సోషలిస్టునని కాసేపు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు నావని మరోసారి, ఇప్పుడు కాషాయం కట్టిన హిందువుగా పవన్ కళ్యాణ్ విభిన్న పాత్రలు పోషిస్తున్నారని వివరించారు. కూటమి ఏడాది పాలనపై ప్రజలు విరుచుకుపడుతున్నారని తెలిపారు. కక్ష సాధింపు చర్యలు మానుకొని ప్రజాస్వామ్యయుతంగా పాలించాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత విషయాలను ఆయన కుటుంబాన్ని కించపరిచే విధానాలను మానుకోవాలని హితవుపలికారు. పార్టీ నాయకులు నిక్కర్ నాగేశ్వరరావు, తొంటా వాసు, మారిశెట్టి శ్రీనివాస్, చిడిపి రవి, చిరిగిన నాగార్జున, పులపాకుల బన్నీ, కోడెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు


చింతలపూడి : విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు


లింగపాలెం : షాపులో మందులను పరిశీలిస్తున్న అధికారులు

చింతలపూడి: విత్తనాలు ఎంఆర్‌పీ ధరకు మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా హెచ్చరించారు. చింతలపూడి మండలంలోని పలు విత్తనాల దుకాణాల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. విత్తనాల శాంపిల్స్ సేకరించారు.

ఈ సందర్భంగా బాషా విలేకరులతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, విక్రయించిన విత్తనాలకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని వ్యాపారులను ఆదేశించారు. గుర్తింపు పొందిన, లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనాలని రైతులకు సూచించారు. విత్తన కొనుగోలు రసీదు పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. పగిలిన ప్యాకెట్లు లేదా మూతలు తీసిన డబ్బాలోని విత్తనాలను కొనొద్దని రైతులకు సూచించారు. తనిఖీల్లో చింతలపూడి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం షాపులో తనిఖీ

లింగపాలెం: స్థానిక పురుగు మందుల షాపులో వ్యవసాయ శాఖ డీఏఓ హబీబ్ బాష గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులోని మందుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. పురుగు మందులు కొన్న రైతులకు బిల్లులు ఇవ్వాలని, మందులు అధిక రేట్లకు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: అర్హులైన వారందరికీ తల్లికి వందనం అందించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం అందిస్తున్న డబ్బులు వివిధ కారణాలు చూపించి అనేక మందికి ఎగ్గొట్టారన్నారు. స్థానిక కొత్తూరు యానాదులు కాలనీకి చెందిన చౌటూరి కోటమ్మ 300 పైబడి యూనిట్లు విద్యుత్ వాడిందని, తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు ఆపేశారని తెలిపారు. చాలీచాలని ఆ ఇంటిలో రెండు బల్బులు వాడిన ఆ కుటుంబానికి 300 యూనిట్లు బిల్లు ఎలా వస్తుందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధితో అర్హులందరికీ తల్లికి వందనం డబ్బులు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనికెళ్ల రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, ఎంపీడీఓ కె.సరళ కుమారి, ఎంఈఓ డి.సుబ్బారావు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా యోగాంధ్ర


యోగాసనాలు వేస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు మాట్లాడుతూ సమస్త మానవాళికి భారతదేశం అందించిన ఆరోగ్యాన్ని సమకూర్చే గొప్పవరం యోగా అని, ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయడానికి ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు. కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత రాజ మార్గంలో నడవడానికి యోగా అభ్యసన అన్నివిధాలుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యఅతిథి ప్రముఖ యోగా బోధకుడు ఆదినారాయణ యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. అనంతరం యోగా బోధకులు విద్యార్థులు, కళాశాల సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమాన్ని యోగా దినోత్సవ కళాశాల ఇన్‌చార్జి టీవీ దుర్గా ప్రసాద్ పర్యవేక్షించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. రూ.3 వేలు విలువైన పుస్తకాలను రూ.8 వేలు, రూ.10 వేలు చొప్పున అమ్మేస్తున్నారని వివరించారు. తమ పాఠశాలలోనే పుస్తకాలు కొనాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్న పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని లెనిన్ కోరారు.

ఉచితంగా భూముల విభజన

జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు తమ భూములను విభజనకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.500 రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితముగా ఈ సేవను పొందుటకు అవకాశం కల్పించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి చెప్పారు. రుసుము రూ.50 గ్రామ సచివాలయంలో చెల్లించి జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ అవకావాన్ని జాయింట్ పట్టాదారులు వినియోగించుకోవాలని కోరారు. దీంతో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలకు అర్హులవుతారని, జాయింట్ పట్టాదారులుగా నమోదయిన భూ యజమానులు జాయింట్ పట్టా విభజనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జేసీ పేర్కొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం గుడివాడకలంక మోడల్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు బి.రాము ఆర్థిక సాయంతో రాత పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయుడు నంబూరి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా రాముని ఎస్ఎంసీ చైర్మన్ ఘంటశాల సుబ్బారావు, ఉపాధ్యాయుడు అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం


మహాసభలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

జంగారెడ్డిగూడెం: ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆరోపించారు. సీపీఐ జంగారెడ్డిగూడెం మండల 11వ మహాసభ గురువారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ కార్యకర్త చిలపరెడ్డి వెంకట రెడ్డి ఆవిష్కరించారు. కుంచే వసంతరావు, నిట్టా స్వర్ణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఏడాది గడుస్తున్న అమలు చేయకుండా రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేసిందని విమర్శించారు. సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలు 2025 జూలై 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలుత పట్టణంలో సీపీఐ కార్యకర్తలు ప్రదర్శన చేశారు. ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం ధారయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాడిస రాము, కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల మండలాల కార్యదర్శులు టి.ఆంజనేయరాజు, గొలిమే బాలయేసు, కుక్కునూరు మండల సహాయ కార్యదర్శి కూరాకుల బాబురావు, జిల్లా సమితి సభ్యులు పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏడు పదుల వయసులో.. క్లిష్టమైన ఆసనాలతో..


సుప్త వజ్రాసనం


మయూర ఆసనం

జంగారెడ్డిగూడెం: ఏడు పదుల వయసులోనూ యోగాసనాలు వేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పాదిలి నాగరాజు శర్మ (70). కాజా పంతులుగా పేరుగాంచిన నాగరాజు శర్మ జంగారెడ్డిగూడెంలో హోటల్ నిర్వహిస్తున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం యోగాపై మక్కువతో ఆసనాలు వేయడం ప్రారంభించి, నేటికీ కొనసాగిస్తున్నారు. యోగా వల్ల శారీరక, మాసిక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని, కఠినమైన శారీరక వ్యాయామాల కన్నా, యోగాసనాలు ఎంతో సులభంగా ఉంటాయని ఆయన చెబుతున్నారు. మనసు, బుద్ధిని నియంత్రణ చేసుకుంటూ, ఏకాగ్రత అనే లక్షణం యోగా వల్ల అలవడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయాలని నాగరాజు శర్మ సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం



కామవరపుకోటలోని కొత్తూరు బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇది. దీని పక్క నుంచి ఉన్న పంచాయతీ మంచినీటి పైపు పగిలి గత కొన్ని నెలలుగా నీరు ప్రవహిస్తోంది. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మొక్కలు పెరిగి, విద్యుత్ తీగలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో పెనుప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని ఆ దారిలో నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు, విద్యార్థులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కామవరపుకోట